


**పదవి ఆమెది..**
**పెత్తనం మరొకరిదా?**

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -63 గురువారం 6 ఆగస్టు 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు 5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## మళ్లీ కీలక వడ్డీరేట్లను మార్చని ఆర్‌బీఐ

రెపో రేటు 5.25 శాతంగానే కొనసాగించిన ఆర్‌బీఐ

ద్రవ్య విధానంలో తటస్థ వైఖరి

ఎస్‌డీఎఫ్ 5%, ఎంఎస్‌ఎఫ్, బ్యాంక్ రేటు 5.5%గా కొనసాగింపు

ప్రపంచ వాణిజ్య అనిశ్చితిపై ఆర్‌బీఐ ఆందోళన

దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందన్న ఆర్‌బీఐ



2లో.

## తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి..



తుమ్మడిహట్టి పెంపునకు ఒత్తడి తెండి

మహారాష్ట్రను ఒప్పించే బాధ్యత తీసుకోండి

కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ వినతి

అటవీ పర్యావరణ అనుమతులుపై భూపేంద్రయాదవ్‌తో చర్చ

ప్రధాని మోడీని తిడితే కేసు పెట్టామని వెల్లడి

బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పెట్టలేదని ప్రశ్న

**న్యూఢిల్లీ,ఆగస్టు 5: (జర్నలిస్ట్ వార్త)**
తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మహారాష్ట్రతో చర్చలకు జోక్యం చేసుకోవాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కోరారు. 148 మీటర్ల ఎత్తు నిర్మాణానికి గతంలోనే ఆ రాష్ట్రం అంగీకరించిన విషయాన్ని సీఎం వివరించారు. 150 మీటర్ల ఎత్తుతో నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. మిగతా 2లో...

## తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఎపికి అనుకూల నిర్ణయాలు

18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి హరీష్ రావు

**హైదరాబాద్,ఆగస్టు 5:(జర్నలిస్ట్ వార్త)**
ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు లభించిన తర్వాత వాటిని సమీక్షించి రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో సాధించిన తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే దిశగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఒక ఉద్యమకారుడిగా ఈ పరిణామాలను చూస్తుంటే తనకు కడుపు రగులుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలనే ధైర్యంమిగతా 2లో...



## తెలంగాణలో ఎమర్జెన్సీకి ఇక ఒకే నంబర్..

డయల్ 112తో అన్ని సేవలు

ఒకే నంబర్‌తో పోలీస్, అంబులెన్స్, ఫైర్ సేవలు

హైదరాబాద్‌లో కొత్త కాల్ సెంటర్‌ను ప్రారంభించిన డీజీపీ

కాలర్ లొకేషన్‌ను గుర్తించి వెంటనే ఆయా సేవలకు సమాచారం

సమీప బృందాలు వెంటనే ఘటనాస్థలికి చేరుకునేలా చర్యలు

ఏడాది పొడవునా 24 గంటలు 112 సేవలు అందుబాటులో

అత్యవసర సేవల్లో ఏఐ వినియోగాన్ని పెంచనున్నట్లు డీజీపీ వెల్లడి




## విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన

ఇది బహుళ క్రీడా కేంద్రం, సీఎం చంద్రబాబు సూచనతోనే రూపకల్పన

సంస్థలే ఛాంపియన్లను నిర్మిస్తాయని, క్రీడలు వ్యక్తిత్వాన్ని పెంచుతాయని వ్యాఖ్య

ఏపీని క్రీడాకారులను తయారు చేసే గమ్యస్థానంగా మార్చడమే లక్ష్యం

ప్రతి బిడ్డలో స్ఫూర్తి నింపిన సింధుకు లోకేశ్ అభినందనలు

2లో.



## రైతులు ఆత్మహత్యలు పట్టవా ?

### : కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శనాస్త్రాలు

దేవరపల్లిలో పొగాకు రైతులను కలిసిన వైఎస్ జగన్

**దేవరపల్లిఆగస్టు 5: (జర్నలిస్ట్ వార్త)**
వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్.. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన, పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విధ్వంసం సృష్టిస్తోందని మిగతా 2లో...



## హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ..




8 ప్రముఖ కాలేజీల అక్రమాల రట్టు!

నకిలీ ఎన్‌ఓసీ పత్రాలను తయారు చేసిన ముఠా గుట్టు రట్టు

పోలీసులకు ఫిర్యాదు చేసిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు

**హైదరాబాద్,ఆగస్టు 5: (జర్నలిస్ట్ వార్త)**
హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న 'హైడ్రా' పేరును వాడుకుని కొందరు అక్రమాలకు యత్నించిన తీరు తీవ్ర కలకలం రేపుతోంది. స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ 'ఫైర్ ఎన్‌ఓసీ' (చీూజ) పత్రాలను తయారు చేసిన ఒక ముఠా గుట్టు రట్టయింది. ఏకంగా నగరంలోని 8 ప్రముఖ ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఈ నకిలీ సర్టిఫికెట్ల ఆధారంగా గుర్తింపు పొందేందుకు యత్నించడం విద్యాశాఖతో పాటు పోలీసు వర్గాలనుమిగతా 2లో...

## 22ఏ భూముల పేరిట అన్యాయం జరగదు

కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు

ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని అదే స్ఫూర్తితో పనిచేయాలి

అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలి

జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టమైన ఆదేశాలు



**హైదరాబాద్,ఆగస్టు 5: (జర్నలిస్ట్ వార్త)**
రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మిగతా 2లో...

## రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు

జార్ఖండ్ నిరుద్యోగులకు సిజెపి మద్దతు

దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తాం

సిజెపి నేత అభిజిత్ దీప్కే స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,ఆగస్టు 5:(జర్నలిస్ట్ వార్త)**
జార్ఖండ్ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మద్దతుమిగతా 2లో...



## అమెరికాలో భారతీయుల ఘనత..

'ఇండియా డే'గా ప్రకటిస్తూ మసాచుసెట్స్ గవర్నర్ ఉత్తర్వులు!

ప్రవాస భారతీయుల సేవలకు గుర్తింపుగా గవర్నర్ మౌరా హీలీ ప్రకటన

బోస్టన్ నగరంలోనూ 'ఇండియా డే'గా పాటిస్తూ మేయర్ ఉత్తర్వులు

భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు భారత సంఘాల సన్నాహాలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 5:(జర్నలిస్ట్ వార్త)**
అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులకు అరుదైన గౌరవం దక్కింది. మసాచుసెట్స్ రాష్ట్రంలో ప్రతి ఏటా ఆగస్టు 15వ తేదీని 'ఇండియా డే'గా అధికారికంగా జరపాలని ఆ రాష్ట్ర గవర్నర్ మౌరా హీలీ ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక, సాంస్కృతిక ప్రగతిలో భారతీయ సమాజం మిగతా 2లో...



అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..



# రైతులు ఆత్మహత్యలు పట్టవా ?

మొదటి పేజీ తరువాయి

ఆయన ఆరోపించారు.పొగాకు బ్యారన్లను పరిశీలించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. "మా ప్రభుత్వ హయాంలో కిలో పొగాకుకు సగటున రూ.289 ధర పలికింది. కొందరు రైతులు రూ.365 వరకు కూడా పొందారు. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వం వచ్చాక ధర రూ.236కు పడిపోయింది. పెట్టుబడి ఖర్చులు పెరుగుతుంటే, గిట్టుబాటు ధర తగ్గిపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు" అని జగన్ అన్నారు. ప్రభుత్వం కేవలం 21 శాతం పంటను మాత్రమే కొనుగోలు చేసిందని, మిగిలిన పంట విషయంలో వ్యాపారులు, సిండికేట్లతో కుమ్మక్కై రైతులను దగా చేస్తోందని విమర్శించారు.
గిట్టుబాటు ధర లేకపోవడంతో వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని జగన్ వెల్లడించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ వెళ్లకపోవడం దారుణమన్నారు. తమ హయాంలో అమలు చేసిన సున్నా వడ్డీ రుణాల పథకాన్ని, రైతు భరోసా కింద అదనంగా ఇచ్చే సహాయాన్ని రద్దు చేశారని, ఉచిత పంటల బీమాను కూడా ఎత్తివేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.

# అమెరికాలో భారతీయుల ఘనత..

మొదటి పేజీ తరువాయి

పోషిస్తున్న కీలక పాత్రకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆమె తెలిపారు. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన జారీ చేశారు.1947లో బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొంది, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ ఆవిర్భవించిందని గవర్నర్ తన ప్రకటనలో కొనియాడారు. వైద్యం, టెక్నాలజీ, విద్య, వ్యాపారం వంటి రంగాల్లో ఇండియన్-అమెరికన్లు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. అమెరికాలో నివసిస్తున్న 50 లక్షల మంది సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న 3.6 కోట్ల మంది ప్రవాస భారతీయుల పాత్రను ఆమె గుర్తుచేశారు.మరోవైపు, బోస్టన్ నగర మేయర్ మిషెల్ వూ కూడా ఆగస్టు 15ను 'ఇండియా డే'గా ప్రకటిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.బోస్టన్‌లో కొత్తగా భారత కాన్సులేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడాన్ని ఆమె స్వాగతించారు.గవర్నర్, మేయర్ల నిర్ణయంపై 'ఇండియా అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ బోస్టన్' (ఐఏజీబీ) వంటి భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బోస్టన్ హార్బర్ వద్ద భారీ పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. అమెరికా గడ్డపై భారతీయ సమాజానికి లభించిన ఈ గౌరవం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు

మొదటి పేజీ తరువాయి

ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడిన దీప్కే, జూలై 29 నుంచి రాంచీలో జరుగుతున్న నిరవధిక ఆందోళనకు తమ సంఘీభావం ఉంటుందని చెప్పారు. తాము తప్పకుండా జార్ఖండ్ వెళ్తామని, అక్కడి విద్యార్థుల ప్రతీ డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ప్రస్తుతం సీజేపీ రాజకీయ పార్టీగా కాకుండా, ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తుందని దీప్కే వెల్లడించారు. న్యాయవ్యవస్థ, రాజకీయాలు, మీడియా, ఎన్నికల సంఘం వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని, వీటిలో జవాబుదారీతనం తీసుకురావడమే తమ ఉద్యమ లక్ష్యమని చెప్పారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు ఇతర నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరపాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

# తెలంగాణలో ఎమర్జెన్సీకి ఇక ఒకే నంబర్..

**హైదరాబాద్,(జర్నలిస్ట్ వార్త)**

తెలంగాణలో అత్యవసర సేవల కోసం ఇకపై ఒకే నంబర్ అందుబాటులో ఉంటుంది. ఇప్పటి వరకు పోలీసులకు 100, అంబులెన్స్, అగ్నిమాపక సేవలకు వేర్వేరు నంబర్లను ఉపయోగించగా, ఇక నుంచి వాటన్నింటికీ డయల్ 112 అమల్లోకి వచ్చింది. హైదరాబాద్‌లో కొత్త ఎమర్జెన్సీ కాల్ సెంటర్‌ను డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు.కొత్త విధానంతో పోలీసు, అంబులెన్స్, అగ్నిమాపక సహా ఇతర అత్యవసర సేవలు ఒకే వేదికపైకి వస్తాయి. రోడ్డు ప్రమాదాలు, దోపిడీలు, గొడవలు, మహిళలపై వేధింపుల వంటి అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేస్తే వెంటనే స్పందన లభించేలా వ్యవస్థను రూపొందించినట్లు డీజీపీ తెలిపారు.ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కాల్స్‌ను పర్యవేక్షిస్తారు. 112కు ఫోన్ వచ్చిన వెంటనే కాలర్ వివరాలు, లొకేషన్‌ను గుర్తించి సమీప పోలీస్ స్టేషన్, అగ్నిమాపక సిబ్బంది, అవసరమైన బృందాలకు సమాచారం పంపిస్తారు. దీంతో సహాయక చర్యలు మరింత వేగంగా ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు.డయల్ 112 సేవలు రోజుకు 24 గంటలు, ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మరింత విస్తృతంగా వినియోగించి అత్యవసర సేవల సామర్థ్యాన్ని పెంచాలని తెలంగాణ పోలీస్ శాఖ లక్ష్యంగా పెట్టుకున్నట్లు డీజీపీ వెల్లడించారు.

# హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ..

మొదటి పేజీ తరువాయి

తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.హైడ్రా కార్యాలయం నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే, కమిషనర్ పేరు మీద దొంగ సంతకాలతో ఫేక్ ఎన్‌ఓసీలు సృష్టించారు. ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అఫిలియేషన్ (అనుమతులు) సాధించడం కోసం సదరు ప్రైవేటు కాలేజీలు ఈ నకిలీ పత్రాలను సమర్పించాయి. అయితే బోర్డు అధికారులు, హైడ్రా యంత్రాంగం డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించినప్పుడు ఆ సర్టిఫికెట్లు నకిలీవని, వారి సంతకాలు ఫోర్జరీకి గురయ్యాయని తేలింది. ఈ దారుణ అక్రమంపై స్పందించిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు.. మోసానికి పాల్పడిన 8 కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ లేక్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు.

**ఫోర్జరీకి పాల్పడిన జూనియర్ కాలేజీలు ఇవే:**

శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, చాంద్రాయణగుట్ట,రెసోనెన్స్ జూనియర్ కాలేజ్, ఎస్ఆర్ నగర్
హైందవి జూనియర్ కాలేజ్, బర్కత్‌పుర,ప్రియాం జూనియర్ కాలేజ్, మెహదీపట్నం
న్యూ ఎరా జూనియర్ కాలేజ్, చిక్కడపల్లి,మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజ్, విద్యానగర్
షాహీన్ జూనియర్ కాలేజ్, శివరాంపల్లి, వశిష్ట జూనియర్ కాలేజ్, తెల్లాపూర్.

# 22ఏ భూముల పేరిట అన్యాయం జరగదు

మొదటి పేజీ తరువాయి

ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదని, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. 22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలు, సూచనలు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ప్రభుత్వ భూములు కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని అన్నారు.నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు.

# తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి..

మొదటి పేజీ తరువాయి

150 మీటర్లకు పెంచినా ముంపు 1000 హెక్టార్లలోపు ఉంటుందని తెలిపారు. తుమ్మిడిహెట్టి నిర్మాణంతో ఎత్తిపోతల ఖర్చు లేకుండా గ్రావిటీతో నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని వివరించారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. బుధవారం పలువురు కేంద్రమంత్రులను సీఎం కలవనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి షెడ్యూల్ బిజీబిజీగా ఉంది. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో.. సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ అభివృద్ధి గురించి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు, రహదారులకు శాఖాపరమైన అనుమతులపై కేంద్రమంత్రికి వినతిపత్రం ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, ఎస్ఆర్ఎస్పీ ఆర్ డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు పాల్గొన్నారు. ఇకపోతే ప్రధాని మోదీని తిడితే భాజపా రాష్ట్రాల్లో ఒక్క కేసు అయినా పెట్టారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధానిని దూషిస్తే తమ ప్రభుత్వం కేసు నమోదు చేసిందని చెప్పారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఒక డీఎస్పీని బదిలీ చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారని.. అధికారిని బదిలీ చేయడం ప్రభుత్వానికి ఉన్న అధికారమని పేర్కొన్నారు. తన పరిధిలో ఉంది కాబట్టే బదిలీ చేశానని చెప్పారు. భాజపా నేతలు కూడా అసభ్యంగా దూషిస్తున్నారని సీఎం విమర్శించారు. కాక్రోచ్ జనతా పార్టీని, విద్యార్థులను అంతకంటే ఎక్కువే దూషించారని పేర్కొన్నారు.

# విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన

**విశాఖపట్నం,ఆగస్టు 5:(జర్నలిస్ట్ వార్త)**

ఒలింపిక్ పతకాలను అథ్లెట్లు గెలుస్తారని, కానీ ఆ ఒలింపిక్ కలలను సాకారం చేసేది అకాడమీలేనని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. పీవీ సింధు అకాడమీ అలాంటి ఛాంపియన్లను తయారుచేసే గొప్ప సంస్థగా ఎదుగుతుందని ఆయన ఆకాంక్షించారు. బుధవారం విశాఖపట్నంలో 'పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' శంకుస్థాపన కార్యక్రమంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ అకాడమీ కేవలం ఒక భవనం కాదని, భావి భారత ఛాంపియన్లకు పునాది అని ఆయన అభివర్ణించారు.ఈ అకాడమీ ఏర్పాటు వెనుక ఉన్న స్ఫూర్తిదాయక నేపథ్యాన్ని లోకేశ్ వివరించారు. "పీవీ సింధు తన హృదయానికి దగ్గరైన ఒక కలతో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఒక బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మించాలనే తన ఆశయాన్ని పంచుకున్నారు. కానీ, మన ముఖ్యమంత్రి ఎప్పుడూ ఉన్నదాని కంటే గొప్పగా ఆలోచించమని సవాల్ విసురుతారు. ఆయన సింధుతో 'కేవలం బ్యాడ్మింటనే ఎందుకు? అంతకు మించి ఆలోచించు. వివిధ క్రీడల్లో నైపుణ్యం ఉన్న పిల్లలందరికీ శిక్షణ ఇచ్చే ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్మించు' అని ప్రోత్సహించారు. ఈ రోజు మనం చూస్తున్న ఈ బృహత్ కార్యం ఆ దార్శనికతకు ప్రతిరూపం" అని లోకేశ్ తెలిపారు. ఇది కేవలం ఒక సౌకర్యం నిర్మించడం కాదని, ఒక వారసత్వాన్ని నిర్మించడం అని ఆయన అన్నారు.
ప్రభుత్వ విధానాలను వివరిస్తూ, చదువుతో పాటు క్రీడలకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని లోకేశ్ స్పష్టం చేశారు. "తరగతి గది జ్ఞానాన్ని నిర్మిస్తే, క్రీడా మైదానం వ్యక్తిత్వాన్ని నిర్మిస్తుంది. అందుకే రాష్ట్రంలోని పాఠశాలల్లో శనివారాలను 'నో బ్యాగ్ డే'గా ప్రకటించాం. విద్యార్థులకు నచ్చిన క్రీడను ఎంచుకునే స్వేచ్ఛ ఇచ్చి, వారికి అవసరమైన క్రీడా పరికరాలను అందిస్తున్నాం" అని తెలిపారు. క్రీడలు క్రమశిక్షణ, గౌరవం, ఓటమిని ఎదుర్కొనే ధైర్యాన్ని నేర్పుతాయని, అందుకే ప్రతి బిడ్డ ఒక క్రీడ ఆడాలని ఆయన అభిప్రాయపడ్డారు.హైదరాబాద్‌లో సైబర్ సిటీ నిర్మిస్తున్నప్పుడు చాలా మంది సందేహాలు వ్యక్తం చేశారని, కంప్యూటర్లు కడుపు నింపుతాయా అని ప్రశ్నించారని లోకేశ్ గుర్తుచేశారు. "కానీ ఆ ఒక్క భవనం హైదరాబాద్‌లో ఐటీ విప్లవానికి నాంది పలికింది. అదేవిధంగా, ఈ అకాడమీ కూడా ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగంలో ఒక విప్లవాత్మక మార్పునకు ఉత్ప్రేరకంగా నిలుస్తుందని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ దత్తాత్రేయకు 18 నెలల గడువు విధిస్తూ, 2028 మే నాటికి రిబ్బన్ కటింగ్ ఉండాలని స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్‌ను కేవలం గొప్ప విద్యార్థులు, పరిశ్రమలకే కాకుండా, గొప్ప క్రీడాకారులను తయారుచేసే గమ్యస్థానంగా మార్చడమే తమ కల అని లోకేశ్ అన్నారు. "ఈ అకాడమీ గేట్ల నుంచి ఒకనాడు ఆశతో అడుగుపెట్టిన చిన్నారి, కొన్నేళ్ల తర్వాత ఒలింపిక్ స్టేడియంలో మన మువ్వన్నెల జెండాను మోస్తుంది. ఆ ప్రయాణం ఇక్కడే ప్రారంభమైందని మనమందరం గుర్తుంచుకుంటాం. 'సింధు చేయగలిగితే, నేను కూడా చేయగలను' అని ప్రతి బిడ్డ నమ్మాలి" అని పిలుపునిచ్చారు. విశాఖను ఎంచుకున్నందుకు సింధుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రభుత్వ పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

# మళ్లీ కీలక వడ్డీరేట్లను మార్చని ఆర్‌బీఐ

**రెపో రేటు 5.25 శాతంగానే కొనసాగించిన ఆర్‌బీఐ**

**ద్రవ్య విధానంలో తటస్థ వైఖరి**

**ఎస్‌డీఎఫ్ 5%, ఎంఎస్ఎఫ్, బ్యాంక్ రేటు 5.5%గా కొనసాగింపు**

**ప్రపంచ వాణిజ్య అనిశ్చితిపై ఆర్‌బీఐ ఆందోళన**

**దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందన్న ఆర్‌బీఐ**

**న్యూఢిల్లీ,ఆగస్టు 5(జర్నలిస్ట్ వార్త)**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి కీలక వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం తర్వాత రెపో రేటును 5.25 శాతంగానే కొనసాగిస్తున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, పెరుగుతున్న వాణిజ్య అనిశ్చితి దృష్ట్యా తటస్థ వైఖరినే కొనసాగిస్తున్నట్టు వెల్లడించింది.
రెపో రేటులో మార్పు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న హోమ్ లోన్, వాహన రుణం, వ్యక్తిగత రుణాల ఈఎంఐలు వెంటనే పెరగవు. కొత్త రుణాలపై కూడా బ్యాంకులు ప్రస్తుత వడ్డీ రేట్లనే కొనసాగించే అవకాశం ఉంది.ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. అమెరికా కొత్త సుంకాలు విధించడం వల్ల ప్రపంచ వాణిజ్య పరిస్థితుల్లో అనిశ్చితి కొనసాగుతోందన్నారు. పశ్చిమాసియా సంక్షోభం ప్రభావంతో ముడి చమురు ధరలు, ఆర్థిక మార్కెట్లు ఇంకా ఒడుదొడుకులకు లోనవుతున్నాయని చెప్పారు.
స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్) రేటును 5 శాతంగానే కొనసాగించారు. మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్ఎఫ్) రేటు, బ్యాంక్ రేటును 5.5 శాతంగా యథాతథంగా ఉంచారు.
ద్రవ్యోల్బణం ఇటీవల కొంత పెరిగినా ఆర్‌బీఐ నిర్దేశించిన పరిమితుల్లోనే ఉందని గవర్నర్ తెలిపారు. ముడి చమురు ధరల పెరుగుదల, రూపాయి మారకపు విలువలో మార్పులు, పశ్చిమాసియా పరిణామాలు ఆర్‌బీఐ నిర్ణయాలపై ప్రభావం చూపుతున్న ప్రధాన అంశాలుగా పేర్కొన్నారు.
మరోవైపు దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని ఆర్‌బీఐ అభిప్రాయపడింది. వృద్ధి రేటులో ఊపు కొనసాగడం, సానుకూల వర్షపాతం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలుస్తున్నాయని వెల్లడించింది.
అయితే కొన్ని రంగాల్లో ప్రారంభ దశ ఒత్తిడి కనిపిస్తోందని సంజయ్ మల్హోత్రా అన్నారు. ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధి అంచనాల చుట్టూ ఇంకా గణనీయమైన ప్రమాదాలు పొంచి ఉన్నాయని వ్యాఖ్యానించారు.
జూన్‌లో జరిగిన గత ఎంపీసీ సమావేశంలో కూడా రెపో రేటును 5.25 శాతంగానే కొనసాగించారు. అదే సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ వృద్ధి అంచనాను 6.9 శాతం నుంచి 6.6 శాతానికి ఆర్‌బీఐ తగ్గించింది. ప్రపంచ అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతలు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు, ఇంధన ధరల పెరుగుదల ఇందుకు కారణాలని అప్పట్లో పేర్కొంది.

# తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

మొదటి పేజీ తరువాయి

ఏపీకి ఎక్కడిదని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే, జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టాడు.కాళేశ్వరం, సీతారామ లాంటి 7 ప్రాజెక్టులు రద్దు చేయండి.. తెలంగాణ నోటికాడ ముక్క లాక్కొండని ప్రతిపాదించారు. దీన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నారు. ఈనెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం అజెండాపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని జీఆర్ఎంబి సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఏపీ కోసమే అజెండా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఆర్ఎంబీలో రెండు రాష్ట్రాలుంటాయి. కేంద్రప్రభుత్వం చైర్మన్‌గా ఉంటే.. ఓవైపు తెలంగాణ ఇంజనీర్లు, మరోవైపు ఏపీ ఇంజనీర్లు ఉంటారు.. జీఆర్ఎంబీలో ఈ ఎజెండా తయారవుతుంటే తెలంగాణ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవేళ తెలంగాణ ఇంజనీర్లు రేవంత్ రెడ్డికి చెప్పినా ఆయన పట్టించుకోలేదా..? అసలు ఈ ఎజెండా ఎట్లా వచ్చింది. ఇచ్చిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడిగే ధైర్యం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడిది. ఇది ఎజెండాలో పెట్టే జీఆర్ఎంబీకి ఎక్కడిది..? అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ అంటే ఎట్లా కనబడుతుంది మీకు. త్యాగాల పునాదుల మీద, పోరాటాల మీద సాధించుకున్న ఈ తెలంగాణ నీళ్ల కోసం జరిగిన ఈ ఉద్యమంలో కేసీఆర్ కష్టపడి 383 టీఎంసీల గోదావరి జలాలను మేం అనుమతులు తెచ్చినమన్నారు. తెచ్చిన అనుమతులు రద్దయితయా..? అని హరీశ్ రావు అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 ఏండ్లలో ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతి తేలేదు.. ఒక్క టీఎంసీకి కూడా మీకు క్లియరెన్స్‌లు తేలేదు. మీరొచ్చిన తర్వాత డీపీఆర్‌లు రిటర్న్ వచ్చినయి. సమ్మక్క బ్యారేజ్, పాలమూరు ఎత్తిపోతల పథకం డీపీఆర్ రిటర్న్ వచ్చింది. వార్ధా డీపీఆర్ రిటర్న్ వచ్చింది ఒక్కో ప్రాజెక్టు వాపసు వస్తున్నాయి. పైగా బీఆర్ఎస్ తెచ్చిన అనుమతులు రద్దు చేయాలనే ఎజెండా వచ్చింది. ఎంత చేతకాని దద్దమ్మ ప్రభుత్వం ఇదని హరీశ్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 ఆగస్టు 25న ఎంతో కష్టపడి సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు సాధించిందని హరీశ్ రావు గుర్తుచేశారు. అయితే ఇప్పుడు ఆ సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఉరి వేసేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా 47 టీఎంసీల సమ్మక్క సాగర్ ప్రాజెక్టును వదులుకోవాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, తెలంగాణ ప్రభుత్వం దానికి అంగీకరించిందన్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నీళ్లు వాస్తవానికి ప్రస్తుత ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్ నగర్‌కు వెళ్తాయని, అయినా కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తాము ఈ అంశాన్ని లేవనెత్తిన రెండు రోజులకే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయడం వారి దివాలాకోరుతనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన ఏడు అనుమతులను రివ్యూ చేస్తామని కేంద్రం చెబుతున్నప్పటికీ బీజేపీ నేతలు ఏమాత్రం స్పందించకపోవడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి భయపడి కేంద్ర మంత్రులు పెదవులు మూసుకుంటున్నారని, దీనిపై బీజేపీ వెంటనే స్పందించకపోతే తెలంగాణ ప్రయోజనాల కోసం మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. తెలంగాణలో ప్రస్తుతం చంద్రబాబు బంటు ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టే జీఆర్ఎంబీ అజెండాలో ఇలాంటి ప్రతిపాదనలు వస్తున్నాయని, ఒకవేళ కేసీఆర్ సీఎంగా ఉంటే ఆంధ్రప్రదేశ్ లేదా కేంద్రానికి ఇంత ధైర్యం వచ్చేదా అని ప్రశ్నించారు. ఏపీ మూలాలు ఉన్న అధికారులు తెలంగాణ ఇరిగేషన్ శాఖలో బాధ్యతలు వహిస్తుండటం వల్లే ఇలా జరుగుతోందని ఆరోపించారు. జీఆర్ఎంబీ సమావేశ అజెండా నుంచి గోదావరి, బనకచర్ల అంశాలను తొలగించాలని, ఈ అజెండాను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పార్లమెంట్‌లో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు గళం విప్పాలని కోరారు. ఇరిగేషన్ విషయంలో ప్రభుత్వం రిట్, సూట్ పిటిషన్ల పేరుతో ఏడాది కాలంగా సమయం వృథా చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి లోపాయికారీ ఒప్పందాలతో గోదావరి, బనకచర్ల ప్రాజెక్టులకు ఒప్పుకున్నారని ఆరోపించారు. గోదావరి జలాల్లో తెలంగాణకు చట్టబద్ధంగా 960 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నప్పటికీ, రాష్ట్ర హక్కులు కాలరాస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తూ బొమ్మలాగా కూర్చున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాలేదని హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. తెలంగాణకు తాగు, సాగునీరు దూరం చేసే కుట్ర జరుగుతోందని హరీశ్ ఆరోపించారు. రాష్ట్రానికి ద్రోహం జరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. గురు దక్షిణ చెల్లించడం కోసం రేవంత్ మౌనంగా ఉన్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో చేతగాని ప్రభుత్వం ఉందని విమర్శించారు. నీటి విషయంలో అన్యాయం జరిగితే తెలంగాణ ఊరుకోదని హెచ్చరించారు. కాళేశ్వరం అనుమతులు రద్దు చేయడమంటే సగం తెలంగాణకు అన్యాయం చేయడమే అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాలను కూడా సరిగా వాడటం లేదని మాజీ మంత్రి విమర్శించారు. గోదావరిపై ఉన్న నీళ్లను ఎత్తిపోయడం లేదన్నారు. తెచ్చిన అనుమతులు కూడా ఇప్పుడు రద్దయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. సమ్మక్క బ్యారేజీకి అనుమతి ఇవ్వొద్దని ఏపీ చెబితే ఉఖీఓఃలో పెట్టారని మండిపడ్డారు. బనకచర్ల, మల్లన్నసాగర్ కడతారు కానీ.. సమ్మక్క బ్యారేజీ ఎందుకు వద్దని హరీశ్ రావు ప్రశ్నించారు.

జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
గురువారం 6 ఆగస్టు 2026

# బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ నేత అండ

**బియ్యం, నిత్యావసర వస్తువుల పంపిణీ.. మరో కుటుంబానికి రూ.11 వేల సాయం**





**హసన్‌పర్తి/ఆగస్టు 5 (జర్నలిస్ట్ వార్త):** ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం సామాజిక బాధ్యత అని గ్రేటర్ వరంగల్ 1వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిర్ర రామన్న గౌడ్ అన్నారు. వర్ధన్నపేట కాంగ్రెస్ నాయకుడు కేర్ నాగరాజు సూచనల మేరకు బుధవారం 1వ డివిజన్ పరిధిలోని పెగడపల్లికి చెందిన పోలేపాక కుమార్ (డబ్బా కుమార్) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను అందజేసి ధైర్యం చెప్పారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలు, ప్రజలకు అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ముచ్చర్ల గ్రామానికి చెందిన తన బాల్యమిత్రుడి తల్లి సిర్లంచ విజయ దశదిన కార్యక్రమానికి హాజరైన చిర్ర రామన్న గౌడ్, బాల్యమిత్రులతో కలిసి కుటుంబ సభ్యులకు రూ. 11 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాలకు తోడుగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీటీసీ సంపత్ యాదవ్, చిట్టి నర్సయ్య, డబ్బా శ్రీను, కిషోర్, కిష్టయ్య, ప్రణీత్, శ్రీను యాదవ్, బండ దేవేందర్ రెడ్డి, గుడికందుల శ్రీనివాస్, ఎలిమి నరేందర్, గన్నోజు వేణు, గుడికందుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు కేంద్రం భారీ ఆర్థిక సహాయం పట్ల హర్షం.

**-తుమ్మల శ్రీనివాస్.**



**బయ్యారం/,ఆగస్టు 5.(జర్నలిస్ట్ వార్త)**
కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి పన్నుల వాటా కింద రూ. 2,370 కోట్ల నిధులను విడుదల చెయ్యడం పట్ల బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ,కేంద్ర ఆర్థిక మంత్రికి నిర్మల సీతారామన్ కి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందని అన్నారు. మౌలిక సదుపాయాలు,రహదారులు, విద్య,వైద్యం, గ్రామీణాభివృద్ధి వంటి పలు రంగాలకు కేంద్రం అందిస్తున్న సహకారం రాష్ట్ర ప్రగతికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సహాయంతో తెలంగాణలో అభివృద్ధి పనులు మరింత వేగవంతమవుతాయని,ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం రాష్ట్ర ప్రజలకు ప్రయోజనకరంగా మారాలని ఆకాంక్షించారు.

# మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు

**ఎల్కతుర్తిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు**

**మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలీసుల సూచన**



**ఎల్కతుర్తి/ఆగస్టు 5 (జర్నలిస్టు వార్త):** మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎల్కతుర్తి పోలీసులు హెచ్చరించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో బుధవారం ఎస్సై నర్సింహారావు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు శ్వాస పరీక్షలు నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ విఠల్‌రావు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడతాయని అన్నారు. విద్యార్థులు, యువత మద్యం, పొగాకు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో మత్తు పదార్థాల విక్రయాలు లేదా వినియోగం కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపి చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రజల సహకారంతో నేరాలు, ప్రమాదాలను అరికట్టేందుకు పోలీసులు నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# చినుకు పడితే చాలు..
# పొలాల దారి బంద్!

**దామెరలో రైతుల రాకపోకలకు తీవ్ర అంతరాయం**

**ఏళ్లుగా పరిష్కారం కాని సమస్య.. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**



**ఎల్కతుర్తి/ఆగస్టు 5 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో రైతులు పొలాలకు వెళ్లే ప్రధాన దారి స్వల్ప వర్షానికే జలమయమవుతోంది. బురద, నీటితో నిండిపోయిన రహదారిపై నడవడమే కష్టంగా మారడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షం కురిస్తే రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామానికి ఆనుకుని ఉన్న వ్యవసాయ భూములకు ఇదే ప్రధాన మార్గం కావడంతో రైతులు, వ్యవసాయ కూలీలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ట్రాక్టర్లు, వ్యవసాయ వాహనాలు కూడా ఈ దారిలో వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో పంటల సాగు పనులు సకాలంలో నిర్వహించలేక నష్టపోతున్నామని రైతులు చెబుతున్నారు. రైతు స్లాప్ రవి మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ఇదే సమస్య ఉన్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రహదారి సరిగా లేక ప్రతి వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకుని శాశ్వత పరిష్కారం చూపించాలని గ్రామ రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతుల సమస్యలను ఇకనైనా ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకోవాలని కోరుతున్నారు.

# హైడ్రా కమిషనర్ సంతకం ఫోర్జరీ.. విద్యా మాఫియా బరితెగింపు

**ఎనిమిది కళాశాలలను సీజ్ చేయాలి..**
**దోషులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి**

**ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ. స్టాలిన్ డిమాండ్**



**హసన్‌పర్తి/ఆగస్టు 5 (జర్నలిస్ట్ వార్త):**
హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్మీడియట్ బోర్డు గుర్తింపు పొందేందుకు ప్రయత్నించిన ఎనిమిది ప్రైవేట్ జూనియర్ కళాశాలల వ్యవహారం రాష్ట్ర విద్యా రంగంలో కలకలం రేపుతోందని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ. స్టాలిన్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉన్నతాధికారి సంతకాన్నే నకిలీ చేసే స్థాయికి విద్యా మాఫియా బరితెగించడం ఆందోళనకరమని అన్నారు. ఇది ప్రభుత్వ పర్యవేక్షణలో ఉన్న లోపాలను బహిర్గతం చేస్తోందని విమర్శించారు. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతూ నకిలీ పత్రాలతో విద్యాసంస్థలు నిర్వహించడం క్షమించరాని నేరమని పేర్కొన్నారు. నకిలీ పత్రాలు సమర్పించిన ఎనిమిది కళాశాలల గుర్తింపును తక్షణమే రద్దు చేసి సీజ్ చేయాలని, ఈ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో స్వతంత్ర విచారణ జరిపించాలని కోరారు. ఫోర్జరీకి పాల్పడిన కళాశాల యాజమాన్యాలతో పాటు సహకరించిన అధికారులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అనుమానాస్పదంగా ఉన్న మరో 60 ప్రైవేట్ కళాశాలల ఫైర్ నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలను సమగ్రంగా పరిశీలించి నివేదికను బహిర్గతం చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అగ్నిమాపక భద్రత, భవన భద్రత ప్రమాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గుర్తింపు రద్దయ్యే కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడకుండా, వారిని సమీప ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ఇతర కళాశాలల్లో చేర్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎన్.ఎ. స్టాలిన్ కోరారు.

# తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలి

**క్రైస్తవులంతా ఐక్యంగా నిలవాలి - టీసీసీ మండల అధ్యక్షుడు బ్రదర్ ఇశ్రాయేలు**



**తల్లాడ/ ఆగస్టు 5 (13 జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ (టీసీసీ) 13వ వార్షికోత్సవాన్ని ఈ నెల 22న ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో క్రైస్తవులందరూ ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని టీసీసీ తల్లాడ మండల అధ్యక్షుడు బ్రదర్ ఇశ్రాయేలు పిలుపునిచ్చారు. బుధవారం తల్లాడలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే అందరూ ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం క్రైస్తవ సమాజం ఒకే వేదికపైకి రావాలని సూచించారు. ఆగస్టు 22న నిర్వహించే తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ 13వ వార్షికోత్సవంలో సంఘ పెద్దలు, పాస్టర్లు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనల్లో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఐక్యతే సమాజానికి బలమని, అందరూ కలిసికట్టుగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# కేరళ బిషప్ ఆధ్వర్యంలో పరిశుద్ధ వివాహం



**తల్లాడ/ఆగస్టు 5 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కలకోడిమ గ్రామంలోని జీఎస్ భవన్‌లోని షాలోము ప్రార్థన మందిరంలో బుధవారం క్రైస్తవ సంప్రదాయంలో పరిశుద్ధ వివాహ వేడుక ఘనంగా జరిగింది. కేరళ రాష్ట్రం తిరువనంతపురం జిల్లా అనపూర్‌కు చెందిన మహారాజు విలియల్ పొంకల్ పూతైనేవీడు మధులత దంపతుల కుమారుడు కిరణ్తో, బిన్ బాబుశ్రీకళ దంపతుల కుమార్తె అకాబిను వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఈ వివాహ మహోత్సవాన్ని బిషప్ రెవ. తులసిద్ధరన్ క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం నిర్వహించి, వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో దిరిశాల దాసురావుతో పాటు మండలంలోని వివిధ సంఘాలకు చెందిన దైవసేవకులు, విశ్వాసులు, బంధువులు, మిత్రులు, సహచరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# గుంతలతో గజిబిజి.. వెంటనే పూడ్చాలి

**సబ్ కలెక్టర్, ఏసీపీకి కాంగ్రెస్ నేతల వినతి**

**బెల్లంపల్లి/ ఆగస్టు 3 (జర్నలిస్ట్ వార్త):**




బెల్లంపల్లిలో రోడ్డు విస్తరణ పేరుతో రహదారి పక్కనున్న దుకాణాలను తొలగించి ఆరు నెలలు గడిచినా పనులు ప్రారంభించకపోవడంతో ప్రధాన రహదారి గుంతలమయంగా మారిందని, ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం బెల్లంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి అఫ్జల్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సబ్ కలెక్టర్, ఏసీపీకి వినతిపత్రం సమర్పించారు. రహదారిపై భారీ గుంతలు ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, బస్సులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతిరోజూ ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రోడ్డు విస్తరణ పనులు ఆలస్యమైనా, కనీసం గుంతలను తక్షణమే పూడ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్, ఏసీపీ సంబంధిత అధికారులతో మాట్లాడి అత్యవసరంగా గుంతలను పూడ్చించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎండి అఫ్జల్ తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు ఎండి గౌస్, బాయ్ పొట్ల సురేష్, జిలకర వాసు, ఆడెపు మహేష్, బైరి శ్రీనివాస్, రాచకొండ గోవర్ధన్ రావు, బబ్లు భాయ్, మత్తమారి జగన్, సిరికొండ రాజాబ్రహ్మం, ఆర్‌ఎం సింగాడియా, కళ్యాణం, పోషం బుజ్జా కృష్ణ, కొద్ది సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు తల్లిపాలు శ్రేయస్కరం.

**-సర్పంచ్ బొల్లి జయంతి.**



**బయ్యారం/,ఆగస్టు 05.(జర్నలిస్ట్ వార్త)**
తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బయ్యారం మండలంలోని జగ్గుతండ పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలు శ్రేయస్కరమని, ఆరోగ్యవంతమైన పిల్లల కోసం ఆరు నెలల పాటు తల్లిపాలు అవసరమన్నారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలే ఉత్తమమైన ఆహారమని,పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ కనబరచాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, గర్భిణీలకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసిడిపివో జ్యోతి,ఉప సర్పంచ్ గుంజ వీరస్వామి,వార్డు సభ్యులు మక్కల దుర్గారావు,సూపర్ వైజర్ పుష్ప,అంగన్వాడీ టీచర్ లక్ష్మి, ముకుంద,ఏఎన్ఎం సమ్మక్క,పద్మ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ పిల్లలకు యూనిఫాం పంపిణీ.

**-సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్.**



**బయ్యారం/,ఆగస్టు 5.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలో సింగారం గ్రామపంచాయతీలో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం విద్యార్థులకు సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ స్కూల్ యూనిఫాం,పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకునే పిల్లలు చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, టీవీ,సెల్‌సెన్‌కు దూరంగా ఉంచి విద్యపై మక్కువ పెంచాలని అప్పుడే పిల్లలు చెడు మార్గాల వైపు వెళ్లకుండా ఉన్నతంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ గంగావత్ పద్మ,ఉపసర్పంచ్ చుంచు మమత,వార్డు సభ్యులు సపవత్ అనిత,విద్య కమిటీ చైర్మన్ గుగులోత్ స్వరూప,అంగన్వాడి ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత.

**-సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్.**



**బయ్యారం/,ఆగస్టు 5.(జర్నలిస్ట్ వార్త)**
కొత్తపేట గ్రామానికి చెందిన భూక్య చిట్టి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ అతని వైద్య చికిత్స దృష్టిలో ఉంచుకుని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రెండున్నర లక్షలు మంజూరు చేపించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ గారు బాధిత కుటుంబ సభ్యులకు 2.5 లక్షల చెక్కును అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు తమకు అండగా నిలిచి సహాయం చేసిన ముఖ్యమంత్రికీ ఎమ్మెల్యేకీ కృతజ్ఞతలు తెలిపారు.

# కార్మిక వాడల సమస్యలు తీర్చకపోతే ఎమ్మెల్యే క్యాంప్ ముట్టడి

## బోడ జనార్ధన్ హెచ్చరిక



**బెల్లంపల్లి/ఆగస్టు 5 (జర్నలిస్ వార్త):** బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సింగరేణి కార్మిక వాడల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఎమ్మెల్యే గడ్డం వినోద్ క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలంగాణ రక్షణ సేన బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి బోడ జనార్ధన్ హెచ్చరించారు.బుధవారం పట్టణంలోని పలు కార్మిక వాడలను సందర్శించిన ఆయన స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ 2018లో సింగరేణి క్వార్టర్లను ప్రభుత్వానికి అప్పగించి నివాసితులకు పట్టాలు అందించినప్పటికీ, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాల కల్పనలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆరోపించారు.సింగరేణి యాజమాన్యం కార్మిక వాడల నిర్వహణను పూర్తిగా విస్మరించిందని, ముఖ్యంగా విద్యుత్ సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన క్వార్టర్లకు తిరిగి విద్యుత్ పునరుద్ధరణ చేయకపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.నియోజకవర్గ ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నప్పటికీ ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రజలకు అందుబాటులో లేకుండా హైదరాబాద్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. బెల్లంపల్లి నియోజకవర్గానికి ఎమ్మెల్యే ఉన్నారా? లేరా? అన్న పరిస్థితి నెలకొన్నదని వ్యాఖ్యానించారు.బూడిదిగడ్డ బస్తీ, కన్నాలబస్తీ, ఇంక్లైన్ బస్తీతో పాటు పట్టణంలోని దాదాపు అన్ని కార్మిక వాడల్లో సమస్యలు పేరుకుపోయాయని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ పాలకవర్గం కూడా పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.కార్మిక కుటుంబాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉద్ధృతం చేసి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని బోడ జనార్ధన్ హెచ్చరించారు.

# సమీకృత వ్యవసాయంతో ఆదర్శంగా నిలుస్తున్న యువ రైతు దంపతులు.





**బయ్యారం/,ఆగస్టు 5.(జర్నలిస్ట్ వార్త):**బయ్యారం మండలంలోని చోక్లాతండా గ్రామంలో యువ రైతు బానోత్ సతీష్,సంధ్య దంపతులు కేవలం 30 గుంటల వ్యవసాయ భూమిలో సమీకృత వ్యవసాయ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.వారి వ్యవసాయ క్షేత్రాన్ని మండల వ్యవసాయ అధికారి కే.రాజు పరిశీలించారు.రైతు దంపతులు తమ పొలంలో కాకరకాయ,బీరకాయ,గోరుచిక్కుడు, వివిధ రకాల ఆకుకూరలు సాగు చేస్తున్నారు.వీటితో పాటు 35 దేశీ (నాటు) కోళ్లను పెంచుతూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. ఇంకా ఒక చిన్న పౌల్ట్రీ యూనిట్ ఏర్పాటు చేసి హైబ్రిడ్ కోళ్లను పెంచుతున్నాట్లు రైతు తెలిపారు.కోళ్లకు అవసరమైన దాణాను కూడా స్వయంగా తయారు చేసుకోవడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకొని లాభదాయకంగా నిర్వహిస్తున్నారు.ఒక గేదెను పాల ఉత్పత్తి కోసం పెంచుతూ, దానికి అవసరమైన పచ్చి మేతను కూడా తమ పొలంలోనే సాగు చేస్తున్నారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ సమీకృత వ్యవసాయ విధానం సుస్థిర వ్యవసాయాన్ని సమన్వయం చేసుకొని అధిక ఆదాయం పొందవచ్చుని తెలిపారు.ఇలాంటి యువ రైతులను ఆదర్శంగా తీసుకొని రైతులు సమీకృత వ్యవసాయాన్ని అవలంబించాలని పిలుపునిచ్చారు.

# స్టేషన్ దారంతా గుంతలే..!

**ఎల్లాపూర్‌లో రైల్వే ప్రయాణికుల నరకయాతన**

**భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతిన్న రహదారి**

**తక్షణమే మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి**





**హసన్‌పర్తి/ ఆగస్టు 5 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ నగరంలోని 65వ డివిజన్ ఎల్లాపూర్‌లో రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. వర్షాకాలం కావడంతో గుంతలు మరింత లోతుగా మారి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. నిత్యం వందలాది మంది ఈ రహదారి గుండా రైల్వే స్టేషన్‌కు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.రైల్వే స్టేషన్ సమీపంలోని కంకర యార్డు నుంచి భారీ లారీలు, ట్రాక్టర్లు నిరంతరం రాకపోకలు సాగించడం వల్ల రహదారి పూర్తిగా దెబ్బతిన్నట్లు స్థానికులు చెబుతున్నారు. గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడే పరిస్థితి ఏర్పడింది. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ రహదారిపై ఎల్లాపూర్ గ్రామ ప్రజలు కూడా నిత్యం ప్రయాణిస్తుండటంతో విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా రహదారులు భవనాల శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ప్రజల ఆందోళన తప్పదని హెచ్చరిస్తున్నారు.

# జగ్గుతండ జిపిలో ప్రత్యేక శానిటరీ పనులు ప్రారంభం.

**-సర్పంచ్ జయంతి**



**బయ్యారం/,ఆగస్టు 5.(జర్నలిస్ట్ వార్త)** జగ్గుతండ పంచాయతీలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడానికి సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక శానిటేషన్ పనులను ప్రారంభించారు.గ్రామంలో మురుగు కాలువల శుభ్రత,పిచ్చిమొక్కల తొలగింపు,చెత్త సేకరణ,దోమల నివారణ మందుల పిచికారీ వంటి కార్యక్రమాలను చేపట్టామని సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా మొదట ఒకటో వార్డు నుండి రెండో వార్డ్ వరకు, నాలుగో వార్డ్ లో స్పెషల్ శానిటరీ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుంజ వీరస్వామి,వార్డు సభ్యులు వట్టం సావిత్రి,కంద్రతి యాకేష్,ఈసం పావని, గ్రామపంచాయతీ సిబ్బంది,కూలీలు సెక్రెటరీ శ్రీహరి పాల్గొన్నారు.

# మోసగాళ్ల వలలో పడొద్దు..!

**విద్యార్థులకు సైబర్ నేరాలపై పోలీసుల హెచ్చరిక**

**ప్రగతి జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు**




**బెల్లంపల్లి/ ఆగస్టు 5 (జర్నలిస్ వార్త):** ఆన్‌లైన్‌లో వచ్చే పెట్టుబడి, ఉద్యోగ ఆఫర్లు, భారీ తగ్గింపుల ప్రకటనలను గుడ్డిగా నమ్మి మోసగాళ్ల వలలో చిక్కుకోవద్దని బెల్లంపల్లి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో కె. శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆదేశాల మేరకు సైబర్ జాగృత దివస్ సందర్భంగా బెల్లంపల్లిలోని ప్రగతి జూనియర్ కళాశాలలో మంగళవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ నకిలీ స్టాక్ ట్రేడింగ్, క్రిప్టోకరెన్సీ పెట్టుబడులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ఆన్‌లైన్ షాపింగ్ ఆఫర్ల పేరుతో సైబర్ మోసాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని చెప్పారు. త్వరగా డబ్బు వస్తుందనే ఆశతో ఎలాంటి పెట్టుబడులు పెట్టవద్దని, తెలియని వ్యక్తులు పంపిన లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు.ఓటీపీ, ఏటీఎం పిన్, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చే పెట్టుబడి, ఉద్యోగ ప్రకటనలను నమ్మే ముందు పూర్తిగా ధృవీకరించుకోవాలని సూచించారు.సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సహాయ సంఖ్యకు సమాచారం ఇవ్వాలని, జాతీయ సైబర్ నేరాల ఫిర్యాదు పోర్టల్‌లో వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలని చెప్పారు. అప్రమత్తతే సైబర్ నేరాల నుంచి రక్షణకు ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**ఎస్సార్ యూనివర్సిటీలో పోలీసుల అవగాహన సదస్సు**






**హసన్‌పర్తి/ఆగస్టు 5 (జర్నలిస్ట్ వార్త):** సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హసన్‌పర్తి సీఐ మహేందర్ సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో చేపట్టిన 'సురక్ష కా తిరంగాఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' ప్రచార కార్యక్రమంలో భాగంగా హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సార్ యూనివర్సిటీలో బుధవారం సైబర్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయొద్దని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పిన్ నంబర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని చెప్పే పెట్టుబడి పథకాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.సైబర్ మోసానికి గురైన వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయాలని, అలాగే కేంద్ర హోం శాఖ సైబర్ నేరాల పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చని వివరించారు. మోసం జరిగిన వెంటనే స్పందిస్తే పోగొట్టుకున్న నగదును తిరిగి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.
కార్యక్రమంలో ఎస్సార్ యూనివర్సిటీ డీన్ (విద్యార్థి సంక్షేమం) డాక్టర్ ఎ.వి.వి. సుధాకర్, డిప్యూటీ రిజిస్ట్రార్ బి. శరత్ కుమార్, సైబర్ సెక్యూరిటీ కోఆర్డినేటర్ ఎం. సంపత్ కుమార్, డీన్ (క్రమశిక్షణ) లెఫ్టినెంట్ ఎ. రాజేశ్వరరావు, వి. మహేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోలీసులు, యూనివర్సిటీ ప్రతినిధులు కలిసి సైబర్ అవగాహన పోస్టర్లను విడుదల చేశారు.

# క్షమాపణ చెప్పకుంటే.. చరిత్ర బయటపెడతా!

**కాంగ్రెస్ నేత కుంబాల రాజేష్‌కు బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ హెచ్చరిక**

**ఆధారాలు చూపాలి.. లేదంటే పరువునష్టం దావా వేస్తా -బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం**



**బెల్లంపల్లి/ఆగస్టు 5 (జర్నలిస్ట్ వార్త):** బెల్లంపల్లి రాజకీయాల్లో ఆరోపణలు, ప్రత్యారోపణలు మరింత వేడెక్కాయి. తనపై కాంగ్రెస్ నాయకుడు కుంబాల రాజేష్ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ మండిపడ్డారు. ఆరోపణలకు తక్షణమే ఆధారాలు వెల్లడించాలని, లేకపోతే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పరువునష్టం దావా వేయడమే కాకుండా, రాజేష్ రాజకీయ, వ్యక్తిగత వ్యవహారాలకు సంబంధించిన వివరాలను దశలవారీగా ప్రజల ముందుకు తీసుకొస్తానని హెచ్చరించారు.బుధవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రావణ్ మాట్లాడుతూ, ఎలాంటి ఆధారాలు లేకుండా తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా ఆరోపణలు చేయడం బాధ్యతారా హిత్యమని విమర్శించారు. హైదరాబాద్‌లో విద్యా సలహా కేంద్రాన్ని నిర్వహిస్తూ ఇంజినీరింగ్ ప్రవేశాల ద్వారా జీవనం సాగిస్తున్నానని, అక్రమంగా ఎవరి వద్దా డబ్బులు తీసుకున్న సందర్భం లేదని స్పష్టం చేశారు.బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా అనేక మంది పేద విద్యార్థులకు వివిధ విద్యాసంస్థల్లో ప్రవేశాలు కల్పించి అండగా నిలిచానని తెలిపారు. తన సేవలను అపప్రథకు గురిచేసే ప్రయత్నాలను సహించబోనని అన్నారు.కాంగ్రెస్ నాయకుడు కుంబాల రాజేష్ వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆయన రాజకీయ, వ్యక్తిగత వ్యవహారాలకు సంబంధించిన వివరాలను వారానికి ఒకటి చొప్పున ప్రజల ముందుకు విడుదల చేస్తానని హెచ్చరించారు.

# వసతి గృహాలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి..






## సౌకర్యాల కల్పనకు ఆదేశాలు

**వర్ధన్నపేట/ఆగస్టు 5 (జర్నలిస్ట్ వార్త):** గిరిజన బాలికల వసతి గృహాల్లో విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్పష్టం చేశారు. బుధవారం వర్ధన్నపేట గిరిజన బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆమె అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు.
వంటగది, ఆహార నిల్వలు, తాగునీటి సదుపాయం, పరిశుభ్రత, వసతి గదులను పరిశీలించిన కలెక్టర్ వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వార్డెన్‌కు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్, భోజన నాణ్యతపై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల విద్యాభ్యాసం, ఆరోగ్యం, వ్యక్తిగత సమస్యల గురించి ఆరా తీస్తూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు.అంతకుముందు నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమంలో విద్యార్థినులకు రాజ్యాంగ విలువలు, జర్నలిజం ప్రాధాన్యం, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ జర్నలిస్టు కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ వార్తాపత్రికలు చదివి సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జడ్పీ సీఈవో రాంరెడ్డి మాట్లాడుతూ
విద్యార్థినుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం కూడా ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతి, విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.
డీబీసీడీఓ పుష్పలత మాట్లాడుతూ
గిరిజన బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన వసతి, పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో



ముందుకు సాగి అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.
డీటీడీఓ నారాయణరెడ్డి మాట్లాడుతూ
గిరిజన విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వసతి గృహాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యాభ్యాసం ద్వారా సమాజంలో ఆదర్శంగా నిలవాలని విద్యార్థినులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ సాగర్, ఎంపీడీవో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

# జై మైసమ్మ నినాదాలతో మారుమోగిన కోటగండ

## భక్తి పారవశ్యంలో బోనాల జాతర.. పటిష్ట పోలీసు బందోబస్తుతో ప్రశాంతంగా ముగింపు





**గీసుగొండ/ ఆగస్టు 5 (జర్నలిస్ట్ వార్త):** జై మైసమ్మ. జై జై మైసమ్మ నినాదాలతో వంచనగిరి నుంచి శ్రీ శ్రీ శ్రీ కోటగండి మైసమ్మ తల్లి ఆలయం వరకు నిర్వహించిన బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా, ప్రశాంతంగా ముగిసింది. రంగురంగుల బోనాలు, డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధరరావు బోనాల ఊరేగింపులో పాల్గొని శ్రీ కోటగండి మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు వెయ్యి మంది భక్తులు బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గీసుగొండ పోలీసులు, క్యూఆర్టీ సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఊరేగింపు మార్గమంతా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఆలయ పరిసరాల్లో భక్తులు ఇబ్బందులు పడకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించారు. ఈ సందర్భంగా గీసుగొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ మాట్లాడుతూ బోనాల మహోత్సవానికి భారీగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉండటంతో ముందస్తు ప్రణాళికతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశాం. పోలీసు సిబ్బంది, క్యూఆర్టీ బృందాలు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాయి. ట్రాఫిక్‌ను సమర్థంగా నియంత్రించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నాం. అందరి సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించగలిగాం అని తెలిపారు.

# కార్మిక సంక్షేమ చట్టం ఎప్పుడొస్తుంది?

### భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై బీఎన్‌ఆర్‌కేఎస్ గళం

### 23వ ఆవిర్భావ దినోత్సవంలో ప్రభుత్వాలకు విజ్ఞప్తి

### కార్మిక సంఘ కార్యాలయానికి స్థలం, సిమెంట్ బస్తాల విరాళం



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఆగస్టు 5 (జర్నలిస్ట్ వార్త):** భవన నిర్మాణ రంగంలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం తీసుకురావాలని బీఎన్‌ఆర్‌కేఎస్ నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఎల్కుర్తి గ్రామంలో బుధవారం బీఎన్‌ఆర్‌కేఎస్ 23వ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామ శాఖ అధ్యక్షుడు కొల్లిపాక స్వామి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణతో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం మాత్రం ఆశించిన స్థాయిలో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల్లో మరణించిన లేదా గాయపడిన కార్మికుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం, సామాజిక భద్రత, ఆరోగ్య బీమా, పిల్లల విద్యకు ప్రత్యేక పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న సంక్షేమ నిబంధనలు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో వేలాది కార్మిక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘ కార్యాలయ నిర్మాణానికి గ్రామ సర్పంచ్ నరిసేటి సుధాకర్ స్థలం కేటాయిస్తానని ప్రకటించగా, కాంట్రాక్టర్ మండ మల్లికార్జున్ 200 సిమెంట్ బస్తాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. వారి సహకారాన్ని సంఘం నాయకులు అభినందించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు జోగు సాంబయ్య, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన



కార్యదర్శి భాష పోయిన కుమార్, సహాయ కార్యదర్శి కే.రాజు, కొల్లిపాక ప్రభుదాస్, ఉప సర్పంచ్ కొల్లిపాక రమేష్, కార్మిక నాయకులు, వార్డు సభ్యులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే నాగరాజు పరామర్శ



**వర్ధన్నపేట/ఆగస్టు 5(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం కట్రియాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త నక్క (మానుక) వెంకటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుమారుడు నక్క కుమారస్వామికి ఆర్థిక సహాయం అందజేసి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యం, బ్లాక్ అధ్యక్షుడు అబిడీ రాజ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు టెంపుల్ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గ్రామ కమిటీల ఏర్పాటు




**వర్ధన్నపేట/ ఆగస్టు 5(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలంలోని ల్యాబర్తి, రామోజీ కుమ్మరిగూడెం తండా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను మంగళవారం ఏర్పాటు చేశారు. టీపీసీసీ నిర్ణయం, ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ల్యాబర్తి గ్రామ అధ్యక్షుడిగా కొయ్యేటి వెంకన్న, రామోజీ కుమ్మరిగూడెం తండా గ్రామ అధ్యక్షుడిగా ఉప్పునూతుల రాములు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబిడీ రాజ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు టెంపుల్ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రతి బాణుప్రసాద్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దామెర ప్రశాంత్, రామోజీ కుమ్మరిగూడెం తండా సర్పంచ్ భూక్యా సుశీల తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నియంత్రణలో అందరూ భాగస్వాములు కావాలి




**బయ్యారం/ఆగస్ట్ 5(జర్నలిస్ట్ వార్త):** సైబర్ నేరాల నియంత్రణ పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉంటూ భద్రతలో భాగస్వామి కావాలని ఎస్ఐ ప్రశాంత్ బాబు అన్నారు. బుధవారం బయ్యారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సైబర్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలు, డిజిటల్ అరెస్ట్, ఓటీపీకేవైసీ మోసాలు, ఫేక్ లింకులు, సోషల్ మీడియా, డీప్‌ఫేక్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద కాల్స్, సందేశాలు, లింకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ఆలయ అభివృద్ధికి రూ.1.11 లక్షల విరాళం




**వర్ధన్నపేట/ ఆగస్టు 5 (జర్నలిస్ట్ వార్త):**
గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో సాబాది బండ (ఫ్లోరింగ్) పనుల కోసం గ్రామ పెద్దలు శ్రీమతి, శ్రీ కౌడగాని రాధికతిరుపతిరావు (దాదాబాయి గోత్రం) దంపతులు రూ.1,11,116 విరాళాన్ని అందజేశారు. ఆలయంలో ఫ్లోరింగ్ లేక భక్తులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారు ముందుకు రావడాన్ని గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మేకిరి భుజంగరావు మాట్లాడుతూ ఆలయంలో ఇంకా పలు అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని, భక్తులు తమ శక్తి మేరకు విరాళాలు అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి మేకిరి మల్లికార్జున్, సర్పంచ్ శ్రీలతదేవేందర్, ఉపసర్పంచ్ రథం, ఆలయ నిర్మాణ దాతలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# చివరి శ్వాస వరకూ సేవే ధ్యేయం... ఇప్పుడు జ్ఞాపకాలే మిగిలాయి

### చాలీచాలని జీతంతో నలుగురు కుమార్తెలను ఉన్నత స్థాయికి చేర్చిన తండ్రి...

### కార్మికుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన పింగిలి శ్రీనివాస్‌రెడ్డి

### ధర్మసాగర్‌లో నేడుదశదిన కర్మ.. కన్నీటి నివాళులర్పిస్తున్న గ్రామం

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఆగస్టు 4 (జర్నలిస్ట్ వార్త):** జీవితమంతా కష్టాలే. చేతికి వచ్చే జీతం కుటుంబ అవసరాలకు కూడా సరిపోని పరిస్థితి. అయినా ఒక్కరోజు కూడా తన బాధను బయటపెట్టలేదు. తన కోసం కాదు. భార్య, నలుగురు కుమార్తెల భవిష్యత్తు కోసం ప్రతి రూపాయిని దాచాడు. గ్రామ ప్రజల కోసం, తనతో కలిసి పనిచేసేగ్రామపంచాయతీ సిబ్బంది కోసం అధికారుల ఎదుట ధైర్యంగా నిలబడ్డాడు. అలాంటి నిరాడంబరుడు, ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీలో 33 సంవత్సరాల పాటు కరోబార్‌గా సేవలందించిన పింగిలి శ్రీనివాస్‌రెడ్డి ఇక లేరనే వార్త ధర్మసాగర్ ప్రజలను తీవ్ర విషాదంలోకి నెట్టింది. శ్రీనివాస్‌రెడ్డి పేరు చెబితే గ్రామంలో ఇప్పటికీ చాలామంది కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. చిరునవ్వుతో పలకరించే స్వభావం, ఎవరికైనా కష్టం వస్తే ముందుగా స్పందించే మనసు, తన సమస్యల కంటే ఇతరుల బాధలనే ఎక్కువగా పట్టించుకునే వ్యక్తిగా ఆయన గుర్తుండిపోయారని గ్రామస్తులు చెబుతున్నారు. ఉద్యోగిగా మాత్రమే కాదు. ధర్మసాగర్ ఉమ్మడి మండల పంచాయతీ యూనియన్ నాయకుడిగా కూడా గ్రామపంచాయతీ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడారు. అరకొర వేతనాలతో పనిచేస్తున్న గ్రామ సిబ్బందికి న్యాయం చేయాలని అధికారులను పలుమార్లు నిలదీశారు. వేతనాల పెంపు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జరిగిన ధర్నాలు, నిరసనల్లో ముందుండి పోరాడారు. కార్మికులకు ఆపదలో అండగా నిలిచిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గౌరవం దక్కింది. ఇంట్లో మాత్రం తండ్రిగా తన బాధ్యతను మరువలేదు. చాలీచాలని జీతంతోనే కుమార్తెలు రజిత, స్వతంత్ర, ప్రియాంక, లావణ్యలకు మంచి చదువు చెప్పించి, వారి పెళ్లిళ్లు జరిపించి తన జీవిత ధ్యేయాన్ని నెరవేర్చారు. తన కష్టాలను పిల్లలకు తెలియనివ్వకుండా వారి భవిష్యత్తు కోసం జీవితాన్ని అంకితం చేశారు. తండ్రిని తలుచుకుంటూ కుమార్తెలు కన్నీరుమున్నీరయ్యారు. మా నాన్న సంపాదించింది డబ్బు కాదు. మనుషుల ప్రేమ. మాకు ఇచ్చింది ఆస్తులు కాదు చదువు, సంస్కారం, ఆత్మవిశ్వాసం. ఆయన లేని లోటు జీవితాంతం తీరదు. ఆయన చూపిన మార్గంలోనే నడవడం మా నిజమైన నివాళి అంటూ భావోద్వేగానికి గురయ్యారు. భార్య పింగిలి రాజ్యలక్ష్మితో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు నేడు దశదిన కర్మ నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి హాజరైన పలువురు గ్రామస్థులు, సహోద్యోగులు, కార్మిక నాయకులు శ్రీనివాస్‌రెడ్డి లాంటి సేవామూర్తులు అరుదు. తనకోసం కాకుండా ఇతరుల కోసం బతికిన మనిషిని ధర్మసాగర్ కోల్పోయింది. ఆయన సేవలు, మంచితనం, పోరాట స్ఫూర్తి ఎప్పటికీ చిరస్మరణీయమే అంటూ కన్నీటి పర్వతమయ్యారు.

# పదవి ఆమెది.. పెత్తనం మరొకరిదా?

## మహిళా రిజర్వేషన్ల అసలు లక్ష్యం నెరవేరుతోందా?

### -ఉమ్మడి వరంగల్ జిల్లాలో మహిళా సర్పంచుల పనితీరుపై ప్రత్యేక కథనం

### ప్రజాప్రతినిధి మహిళే అయినా.. నిర్ణయాలు మాత్రం కుటుంబ సభ్యుల చేతుల్లోనే ఉన్నాయనే చర్చ

### మహిళా సాధికారతకు శిక్షణ, పర్యవేక్షణ, చట్టాల అమలు అవసరమంటున్న నిపుణులు




**హనుమకొండ బ్యూరో (జర్నలిస్ట్ వార్త)**
గ్రామీణ పాలనలో మహిళలకు సముచిత స్థానం కల్పించాలనే లక్ష్యంతో రాజ్యాంగంలోని 73వ సవరణ ద్వారా స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. తెలంగాణలోనూ గ్రామపంచాయతీ ఎన్నికల్లో మహిళలకు గణనీయమైన రిజర్వేషన్ కల్పించడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక మంది మహిళలు సర్పంచులుగా ఎన్నికయ్యారు. ఈ నిర్ణయం మహిళా సాధికారతకు కొత్త దారులు తెరిచినప్పటికీ, కొన్ని గ్రామాల్లో ఆ లక్ష్యం పూర్తిస్థాయిలో సాకారం కావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లాలో పలుచోట్ల మహిళా సర్పంచులు స్వయంగా గ్రామాభివృద్ధి కార్యక్రమాలు పర్యవేక్షిస్తూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో మాత్రం వారి కుటుంబ సభ్యులు, ముఖ్యంగా భర్తలు, గ్రామపంచాయతీ వ్యవహారాల్లో అధికంగా కనిపిస్తున్నారనే చర్చ గ్రామస్థుల్లో సాగుతోంది. ఈ పరిస్థితి మహిళా రిజర్వేషన్ల అసలు ఉద్దేశంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**పదవి మహిళదే.. బాధ్యత కూడా ఆమెదే**

గ్రామసభలకు అధ్యక్షత వహించడం, తీర్మానాలపై సంతకాలు చేయడం, అభివృద్ధి పనులను పర్యవేక్షించడం, అధికారులతో సమీక్ష సమావేశాల్లో పాల్గొనడం వంటి బాధ్యతలు ఎన్నికైన సర్పంచ్‌కే చెందుతాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికైన ప్రజాప్రతినిధే నిర్ణయాలు తీసుకోవడం చట్టబద్ధమైన విధానం. అయితే, కొన్ని ప్రాంతాల్లో ప్రజలు తమ సమస్యలతో సర్పంచ్‌ను కాకుండా ఆమె కుటుంబ సభ్యులను ఆశ్రయిస్తున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**ఆదర్శ మహిళా సర్పంచులూ ఉన్నారు**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అనేక గ్రామాల్లో మహిళా సర్పంచులు స్వయంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. గ్రామసభలు క్రమం తప్పకుండా నిర్వహించడం, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాల్లో చురుకుగా వ్యవహరిస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. అలాంటి ప్రజాప్రతినిధులు మహిళా నాయకత్వానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

**శిక్షణతో పెరగనున్న ఆత్మవిశ్వాసం**

స్థానిక సంస్థలకు కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో చాలామందికి పరిపాలన, ఆర్థిక నిర్వహణ, చట్టపరమైన విధానాలపై పూర్తి అవగాహన ఉండకపోవచ్చు. ఈ నేపథ్యంలో మహిళా సర్పంచులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తే వారు మరింత సమర్థంగా బాధ్యతలు నిర్వహించే అవకాశం ఉంటుందని అధికారులు, సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

**పర్యవేక్షణ అవసరమా?**

మహిళా రిజర్వేషన్ల లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరాలంటే జిల్లా యంత్రాంగం గ్రామపంచాయతీల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాల్సిన అవసరం ఉందని ప్రజలు సూచిస్తున్నారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులే అధికారిక విధులు నిర్వర్తించేలా అవగాహన కల్పించడం, అవసరమైన చోట శిక్షణ అందించడం ద్వారా మహిళల రాజకీయ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయవచ్చని అభిప్రాయపడుతున్నారు.

**మహిళా సాధికారతే అసలు లక్ష్యం**

రిజర్వేషన్లు కేవలం పదవులు కేటాయించడానికే కాదు, మహిళలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే నాయకులుగా ఎదగాలనే ఉద్దేశంతో అమల్లోకి వచ్చాయి. అందువల్ల మహిళా సర్పంచులకు కుటుంబ సభ్యుల సహకారం ఉండొచ్చు గానీ, ప్రజాప్రతినిధిగా చట్టబద్ధ బాధ్యతలను వారే నిర్వర్తించేలా ప్రోత్సహించడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

**అధికారులు చేపట్టాల్సిన చర్యలు**

మహిళా సర్పంచులకు క్రమం తప్పకుండా పరిపాలనా శిక్షణ. గ్రామసభల్లో ఎన్నికైన సర్పంచ్ పాల్గొనేలా పర్యవేక్షణ. స్థానిక సంస్థల చట్టాలపై అవగాహన కార్యక్రమాలు. మహిళా ప్రజాప్రతినిధుల నాయకత్వాన్ని ప్రోత్సహించే ప్రత్యేక కార్యక్రమాలు. నిర్వహించాలి